
www.prajasakti.com
ప్రజాశక్తి
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం 30 డిసెంబర్ 2023





నుడా నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్: నూతన లే-అవుట్లు నిర్మాణలలో నాణ్యమైన వసతులను కల్పిస్తేనే నుడా అప్రూవల్స్ ఇవ్వాల్సిందిగా నుడా అధికారులకు ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గతంలో ఎటువంటి నియమాలు పాటించకుండా గీతలు గీసి లేఅవుట్లు వేసినందువల్ల నేడు ప్రజలు అనేక రకమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని గుర్తించుకొని నుడా నుండి ఇచ్చే అనుమతులలో నియమ నిబంధనలు పాటించాలని ఎంపి ఆదాల కోరారు. శుక్రవారం నెల్లూరులోని గాంధీనగర్ లో రూ 6 కోట్ల వ్యయంతో నిర్మించిన నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(నుడా) నూతన భవనం ప్రారంభోత్సవానికి ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డితో కలిసి హాజరయ్యారు.కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ పొట్లూరు స్రవంతి జయవర్ధన్, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకనాథ్, కొండ్రెడ్డి రంగారెడ్డి, నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, రూప్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాకాణి

వ్యవసాయంలో అతివృష్టి, అనావృష్టి..!

వ్యవసాయ రంగం ఈ ఏడాది ఒడిదుడుకులకు గురైంది. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొ న్నాయి. కరువుతో మెట్ట ప్రాంతాల్లో పంటలు ఎండి పోయాయి. భూగర్భ జలాలు అడుగంటాయి. ప్రధానమైన సోమశిల, కండలేరు ప్రాజెక్టుల్లో ఎన్నడూ లేని విధంగా నీటి నిల్వలు పడిపోయాయి. సందెట్లో సడేమియా అన్నట్లు మిచౌంగ్ తుపాన్ రూపంలో జిల్లా రైతాంగాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. 70 వేల ఎకరాల్లో నారు, నారుమళ్లు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమైయిందనే విమర్శ లొ చ్చాయి. ఈ ఏడాది రైతాంగ పరిస్థితి దయనీయంగా మారింది.

- ◆సాగునీటి రైతాంగం కటకట
- ◆తీవ్ర వర్షాభావ పరిస్థితులు
- ◆మిచౌంగ్ తుపాన్‌తో 70 వేల ఎకరాల్లో నష్టం


దెబ్బతిన్న పంటను చూపిస్తున్న రైతు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

వ్యవసాయ రంగం ప్రత్యేక పరిస్థితులు ఎదుర్కొంది. జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా సాగు, తాగునీరు ఇబ్బందులు తలెత్తాయి. అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడంతో సోమశిల ప్రాజెక్టులోని నీరు వాడుక విషయంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రతేడాది సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్‌లలో భారీ వర్షాలు, వరదలు వచ్చేవి. ఈ ఏడాది వర్షం ముఖం చాటేసింది. జిల్లా సాధారణ వర్షపాతం 1080 మిమి మాత్రమే. సోమశిల ప్రాజెక్టులో 50 టిఎంసిలు నీరు ఉండగా, అధికారులు సుమారు 24 టిఎంసిల నీరు ఖర్చుచేశారు. కేవలం లక్ష ఎకరాలు మాత్రమే సాగుచేశారు. ఈ విషయంలో ఐఎబిలో ప్రజా ప్రతినిధులు నిలదీశారు. ప్రస్తుతం సోమశిల ప్రాజెక్టులో కేవలం 35 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. ఈ మొత్తంతో సోమశిల, పెన్నా డెల్టాలో సాగు ఇబ్బందులు మారాయి. పెన్నా డెల్టా కింద 4.50 లక్షల ఎకరాల్లో పంట సాగుచేయాల్సి ఉంది. కేవలం 2.20 లక్షల ఎకరాలు మాత్రమే నీరు ఇవ్వగలమని అధికారులు తేల్చి చెప్పారు. రైతులు ఎవరు సాగు చేయాలనే విషయంలో మల్లగుల్లాలు పడుతున్నారు. జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని మెట్ట ప్రాంతాలు ఆత్మకూరు,. వింజమూరు, ఉదయగిరి, మర్రిపాడు, సీతారామపురంతోపాటు అనేక ప్రాంతాల్లో పంటలు ఎండిపోయాయి. పొగాకు, పత్తి, మొక్కజొన్న, నిమ్మ తదితర పంటలు పొలాలు ఎండిపోయాయి. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసినా రైతులకు ఒక్క పైసా సాయం అందజేయలేదు. ఎన్నడూ లేని పరిస్థితులను జిల్లా రైతాంగం ఎదుర్కొంది. ఇరిగేషన్ శాఖ అధికారులు గతంలో ఎన్నడూ లేని విధంగా లస్కర్లకు కూడా గౌరవ వేతనం ఇవ్వలేదు. ఈ కారణంగా కాలువల కింద నీటి వినియోగించే విషయంలో అలసత్వం జరగడంతో నీరు వృథా అయిందని తెలుస్తోంది. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా రైతులు ఇబ్బందులు పడుతోన్నవేళ, మిచౌంగ్ తుపాన్ పెద్ద ఎత్తున నష్టం తెచ్చింది. సుమారు 70 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ప్రభుత్వం కేవలం విత్తనాలు సబ్సిడీ కింద అందజేసి, చేతులు దులుపుకుంది. మళ్లీ రైతులు నారుమళ్లకు సిద్ధమౌతోంది. ఇక వర్షాలు కురిసే పరిస్థితులు కనిపించడం లేదు. ఇదే జరిగితే జిల్లాలో తీవ్రమైన కరువు వస్తుంది.

రౌండప్



పొదలకూరులో అధికారుల దాడులు

ప్రజాశక్తి-పొదలకూరు

స్థానిక బస్టాండ్‌లో నెల్లూరు జిల్లా డివిజనల్ తూనికల కొలతల అధికారి శేఖర్ బాబు శుక్రవారం దాడులు నిర్వహించారు. దీంతో విషయం తెలుసుకున్న యజమానులు షాపులు మూసేసి పరుగులు తీశారు. బస్టాండ్‌లో సుధా ఫ్యాన్సీ అండ్ కూల్ డ్రింక్ షాప్‌లో తనిఖీ చేయగా కూల్ డ్రింక్స్ అధిక ధరలకు విక్రయించినందున షాపు యజమానికి రూ.5వేలు పెనాల్టీ విధించారు. మిగతా వారు షాపులు మూసేశారు.


మాట్లాడుతున్న ఎస్‌పి

చట్టానికి లోబడి నూతన సంవత్సర వేడుకలు చేసుకోవాలి

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్: నూతన సంవత్సరం సందర్భంగా జిల్లాలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అనుమతుల్లేవు ..ఇతరులకు ఇబ్బందులు కలిగే విధంగా ఎవరు ప్రవర్తించినా,రోడ్లపై బైక్ లు పెట్టి గలబాలు చేసినా, బైక్ లతో పెద్ద శబ్దాలు చేసినా, అనుమతులు లేకుండా డీజే లు లాంటివి పెట్టినా చట్ట రీత్యా చర్యలు తప్పవు అని పోలీసులు అప్రమత్తంగా ఉంటారని ఎస్‌పి డాక్టర్ తిరుమలేశ్వర్ రెడ్డి జిల్లా ప్రజలకు తెలియజేశారు.ఎవరికి ఇబ్బందుల్లేకుండా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవచ్చునని తెలిపారు.

నిరవధిక సమ్మెపై ప్రభుత్వం స్పందించాలి

-ప్రత్యక్ష పోరాటానికి కార్మిక సంఘాలు సన్నదం-నినాదాల నడుమ దద్దరిల్లిన కలెక్టరేట్


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు కార్మికులు

ప్రజాశక్తి-నెల్లూరు గడిచిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతిపక్షహోదాలో అంగన్‌వాడీ కార్యకర్తలకు, మున్సిపల్ కార్మికులకు, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు వైసిపి ప్రభుత్వం చేసిన హామీలు అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న నిరవధిక సమ్మెపై ప్రభుత్వం స్పందించాలని, లేని పక్షంలో కార్మిక, ప్రజా సంఘాలు కలిసి ప్రభుత్వంతో ప్రత్యక్షపోరాటానికి దిగుతామని ఆయా సంఘాల నాయ కులు హెచ్చరిం చాయి. శుక్రవారం అంగన్‌వాడీ, మున్సిపల్,ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరవధిక సమ్మెకు మద్దతుగా కార్మిక ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నగరంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ వైఎంసిఎ గ్రౌండ్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ స్థాయిలో చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులు, ఎస్ఎస్ఎ ఉద్యోగులు బైటాయించి నిరసన ధర్నా చేపట్టారు. ధర్నా సందర్భంగా నిర్వహించిన సభా కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి ప్రసాద్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో చేసిన హామీలు అమలు చేయాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు ,మున్సిపల్ కార్మికులు, సర్వశిక్ష అభయాన్ ప్రాజెక్ట ఉద్యోగులు నిరవధిక సమ్మె బాట పట్టిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. గడిచిన 18 రోజుల నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, 4 రోజుల నుంచి మున్సిపల్ కార్మికులు, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు 10 రోజుల నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక సంపూర్ణ మద్దతు ప్రకటించిందన్నారు. పండుగ సమయంలో కార్మికుల కడుపు మంట శోకంగా మారకుండా ఉండాలంటే వారి న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలన్నారు. వీరు చేస్తున్న నిరవధిక సమ్మెకు కార్మిక సంఘాలైన సిఐటియు, ఏఐటియుసి, ఐఎఫ్‌టియు, ఏఐఎఫ్‌టియు, రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం అన్ని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని కలెక్టరేట్‌ల ఎదుట నిరసన ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్పందించి అంగన్‌వాడీ కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులు, ఎస్ఎస్ఎ ఉద్యోగులు సంతోషపడే విధమైన వార్తను తెలియజేస్తారని భావిస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి సంతృప్తికరమైన వార్త రాని పక్షంలో శనివారం నుంచి ప్రత్యేక్ష పోరాటంలోకి కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు రానున్నాయన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులు, ఎస్ఎస్ఎ ఉద్యోగులు నిరవదిక సమ్మె చేస్తున్నది కేవలం ప్రతి పక్ష హోదాలో ఉన్న సమయంలో చేసిన హామీలు అమలు చేయాలని మాత్రమే అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చంద్ర రాజగోపాల్, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.వి.వి ప్రసాద్, కె.అజయ్‌కుమార్, పట్టణ, రూరల్ సిఐటియు కార్యదర్శులు జి.నాగేశ్వరరావు, రూరల్ కిన్నెర కుమార్, రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య,కొండా ప్రసాద్, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె రెహానాబేగం, సుజాతమ్మ, ఏఐఎఫ్‌టియు (న్యూ) యానాదయ్య, కొండమ్మ, ఐఎఫ్‌టియు నాయకులు రాంబాబు, రైతు సంఘాల సమన్వయ నాయకులు జొన్నలగడ్డ వెంకమరాజు, గంగపట్నం రమణయ్య, షాన్‌వాజ్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు: మండలంలోని మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల బలిజ పాలెంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం. ప్రియంవద క్షేత్రస్థాయిలో జరిగే లెప్రసి కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఆశా కార్యకర్తలు సర్వే చేసిన కొన్ని ఇళ్లను తనిఖీ చేశారు. ప్రతి ఒక్క ఆశా కార్యకర్త గ్రామాల్లో ఇంటింటికి తిరిగి చర్మంపై స్పర్శ లేని మచ్చలను, చెవులపై , వీపుపై , స్పర్శ నొప్పిలేని బొడిపెలు ఉన్నవారిని గుర్తించాలని కొత్త అనుమానితుల గల వారి వివరాలను వెంటనే ఆరోగ్య కార్యకర్తలు సంబంధిత సెక్టార్ సూపర్వైజర్లకు తెలియజేయాలని ఆదేశించారు. ఒకవేళ ఇంటిలో ఎవరైనా లేనివారిని తిరిగి మరుసటి రోజు వారిని పరీక్షించాలని ఆశా కార్యకర్తలకు తెలిపారు .ఈ కార్యక్రమం జనవరి 12వ తేదీ వరకు జరుగుతుందని అన్నారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో డాక్టర్ సి హెచ్ రాకేష్ , ఎం. పి. హెచ్.ఇ ఒ షేక్ ఆరిఫుల్లా, హెల్త్ సూపర్వైజర్ ఎం. శ్రీనివాసరావు, ఏం ఎల్ హెచ్ పి జ్యోతి , ఎఎన్ ఎం గీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధికారి

నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-నెల్లూరు: నగరంలోని దేవా రెడ్డి వారి వీధిలో నివాసం ఉంటున్న గేవాచంద్ అనే వ్యక్తి ఇంటిలో ఈ నెల 13న జరిగిన దొంగతనం కేసులో ముద్దాయిలను అరెస్టు చేశామని ఎస్‌పి డాక్టరు కె.తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కేసుకు సంబంధించిన ఆరుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 42 లక్షల రూపాయల విలువ చేసే 700 గ్రాముల బంగారం, నగదు నగర పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. నెల్లూరు,చిత్తూరు బాపట్ల జిల్లా లకి చెందిన గణేష్,రాళ్ల సురేష్, చేపలమూడి మధు, తోకల నాగరాజు,మాకాల మునిరాజ, బుడంగుంట కష్ణ అనే ఆరు మంది నిందితులు చెడు వ్యసనాలకు అలవాటు పడి వద్ధ దంపతులను గాయపరిచి ఇంట్లో బంధించి దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించామన్నారు. చెడు వ్యసనాలకు బానిసలై సులభంగా డబ్బు సంపాదించుటకు ముద్దాయిలు ఈ దోపిడీలకి పాల్పడ్డారని సాంకేతిక ఆధారాలతో కేసు చేదించినట్టు ఈ కేసులో మొదట ముగ్గురు నిందితులు అనుకున్నా తర్వాత ఆరు మంది నిందితులు గా గుర్తించి అందరినీ అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 700 గ్రాముల బంగారు నగలు రికవరీ చేసిన్నట్టు తెలిపారు. ఈ ఆరు మంది నిందితుల్లో నెల్లూరు,చిత్తూరు బాపట్ల జిల్లాలు కు చెందిన నిందితులు ఉన్నట్లు వీరు నెల్లూరు సిటీలో రెక్కీ చేసి పక్కా ప్రణాళికతోనే దోపిడీ చేసినట్టు నిందితులను పట్టుకునేందుకు బందాలుగా ఏర్పడి సాంకేతికత ఆధారంతో చాకచక్యంగా పోలీసులు అరెస్టు చేసినట్టు తెలియజేశారు .ఈ మీడియా సమావేశంలో నగర,రూరల్ డిఎస్‌పిలు శ్రీనివాసులురెడ్డి, వీరాంజనేయ రెడ్డి, సంతపేట సిఐ కళ్యాణ్ రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పిడిఎస్‌యు ఆందోళన

ప్రజాశక్తి-నెల్లూరు: స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంతంలో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న స్కాలర్‌షిప్ రీయింబర్స్‌మెంటును విడుదల చేయాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సునీల్ మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం పూర్తి కావస్తున్నా ప్రభుత్వం విద్యార్థులు సంబంధించినటువంటి స్కాలర్షిప్,రీయింబర్స్‌మెంట్‌చ విద్యా దీవెన, వసతి దీవెనలను అందజేయకపోవడం దారుణమన్నారు. అదేవిధంగా సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించకపోవడం హాస్టల్లో విద్యార్థులు అనేక రకాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. పెండింగ్‌లోని మెస్ ఛార్జీలను విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలను పెంచాలని పి డి ఎస్ యు డిమాండ్ చేస్తుందన్నారు.జిఒనంబర్ 77 రద్దుచేసి పాత పద్ధతిలోనే పీజీ విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ అందజేయాలన్నారు. విద్యార్థులకు సకాలంలో ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యం విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా వేదింపులకు గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో త్వరలో చలో విజయవాడ కార్యక్రమం పెట్టి సంక్షేమ ఆఫీసులను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ కే షారుఖ్ ,నగర కార్యదర్శి వసీం. నాయకులు బాబురావు, చరణం, విద్యార్థులు పాల్గొన్నారు


నినాదాలు చేస్తున్న నాయకులు

ఉద్యోగుల సమ్మెకు రూరల్ ఎంఎల్ఎ సంఘీభావం

ప్రజాశక్తి-నెల్లూరు : సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు చేపడుతున్న నిరవదిక సమ్మెకు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. శనివారం కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు చేస్తున్న నిరవదిక సమ్మె10వ రోజు చేరుకుందని, ప్రభుత్వం స్పందించి వెంటనే వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు.



టిడిపిలో చేరిన ముస్లిములు

టిడిపిలో ముస్లిం కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో చేరేవారి సంఖ్య పెరుగుతోంది. జగన్మోహన్ రెడ్డి దుర్మార్గపు పాలన నచ్చక అనేకమంది వైసీపీకి గుడ్ బై చెబుతున్నారు. ఇంటూరి నాగేశ్వరరావు ఇస్తున్న భరోసాతో తెలుగుదేశం పార్టీ వైపు అడుగులు వేస్తున్నారు. కందుకూరు పట్టణంలో ఇప్పటికే ముస్లిం కుటుంబాలు భారీ సంఖ్యలో ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో టిడిపిలో చేరగా, ఇప్పుడు ఉలవపాడు మండలం నుంచి చేరికలు మొదలయ్యాయి. శుక్రవారం ఉలవపాడు గ్రామానికి చెందిన 10 ముస్లిం కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పుకున్నారు. కందుకూరు పార్టీ కార్యాలయంలో ఇంటూరి నాగేశ్వరరావు వారందరినీ పార్టీలోకి ఆహ్వానించారు. ఉలవపాడు కు చెందిన కొందరు ముస్లిములు టిడిపిలో చేరారు. వారంతా కుటుంబాలతో సహా వచ్చిమరీ నాగేశ్వరరావుకి మద్దతు తెలపడం విశేషం. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అభివద్ధి సంక్షేమ ఫలాలు అందుకున్న మైనారిటీలు, జగన్ ప్రభుత్వం వచ్చాక ఏమేమి కోల్పోయామో గుర్తించారన్నారు. అప్పట్లో కార్పొరేషన్ రుణాలు, విదేశీవిద్య, దుల్హన్, రంజాన్ తోఫా లాంటి పథకాల ద్వారా మేలు జరిగిందని చెప్పారు. ఎన్నికలకు ముందు మైనారిటీలకు అనేక హామీలు ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి, గద్దెనెక్కాక పట్టించుకోకపోవడంతోనే మైనార్టీలు వైసీపీని వదిలి బయటకు వస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారు, రాబోయే ఎన్నికల్లో కందుకూరులో పార్టీ గెలుపు లక్ష్యంగా పనిచేయాలన్నారు.కార్యక్రమంలో ఉలవపాడు పార్టీ నాయకులు షేక్ కరీం, షేక్ ఖాదర్, షేక్ బాజీ, బొడ్డు ప్రసాద్, పోలుబోయిన శ్రీనివాసులు, రాచగర్ల శివకుమార్, కొప్పోలు రవితో పాటు కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ మున్నా పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ నిర్మాణం కోసం భూసేకరణ వేగవంతం

ప్రజాశక్తి-నెల్లూరు: జిల్లాలో జాతీయ రహదారులు నిర్మాణం కోసం భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎం .హరి నారాయణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జాతీయ రహదారులకు భూసేకరణ, రామాయపట్నం నిర్వాసితుల పునరావాసానికి అవసరమైన భూ సేకరణ పై ఎన్. హెచ్, ఆర్‌డిఒలు, మ్యారిటైమ్ బోర్డు అధికారులతో కలెక్టర్ సమీక్ష చేశారు.ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పేద రైతులను దష్టిలో పెట్టుకుని హైవేస్ అధికారులు బద్వేలు- నెల్లూరు జాతీయ రహదారి భూ సేకరణలో నిబంధనల ప్రకారం ధర పెంచి ఇచ్చే విషయంలో సహకరించాలన్నారు. కష్ణపట్నం పోర్ట్ రహదారికి సంబంధించిన భూ సేకరణ, అవార్డు పాస్ చేయటం త్వరితగతిన చేపట్టాలని సూచించారు.రామాయపట్నం పోర్టు నిర్వాసితుల సేకరణ కోసం ఎక్కువ మంది సిబ్బందిని టీం గా ఏర్పాటుచేసి భూ సేకరణ చేయాలని, అవార్డు పాస్ చేయటం, డిడి పబ్లికేషన్ పూర్తి చేయాలని అన్నారు. సమావేశంలో కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, ఆర్‌డిఒ మలోల, ఆత్మకూర్ ఆర్‌డిఒ మధులత, మ్యారిటైమ్ బోర్డు అధికారులు ఐ వి రెడ్డి, పద్మావతి, ఎన్ హెచ్ ఏ ఐ పి డి గోయల్ ,తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్

ఉన్నత విద్యకు భరోసాగా జగనన్న విద్యాదీవెన

ప్రజాశక్తి-నెల్లూరు: విద్యార్థులకు ఉన్నత విద్యపై భరోసా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా జిల్లాలో 40740 మంది విద్యార్థులకు రూ. 30.45 కోట్లు నిధులను నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేసినట్లు జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నుంచి జగనన్న విద్యాదీవెన నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి తల్లుల ఖాతాలకు జమ చేశారు. నెల్లూరు కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణం నుంచి జాయింట్ కలెక్టర్, అధికారులు, విద్యార్థులు వర్చువల్ గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పేద మధ్యతరగతి ప్రజలు ఆర్థిక కష్టాలతో తమ పిల్లలను ఉన్నత విద్య చదివించడానికి ఇబ్బందులు పడుతున్న తరుణంలో వారు కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజు మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించేలా ప్రవేశపెట్టిన జగనన్న విద్యా దీవెన పథకం విద్యార్థులకు ఓ వరంలా మారిందన్నారు. పదో తరగతి వరకే చదివి ఆపేసే గ్రామీణ విద్యార్థుల తో పాటు, పట్టణ ప్రాంతాల్లోని మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజులు చెల్లించే ఇబ్బందులు తప్పాయన్నారు. డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ వంటి ఉన్నత విద్య అభ్యసిస్తోన్న విద్యార్థులకు సంబంధించిన ఫీజు బకాయిలను విడతల వారీగా ప్రభుత్వమే విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాలకు జమ చేయడం తో, వారు ఆ డబ్బును కళాశాలలకు చెల్లించి ఫీజుల ఆర్థికభారం నుంచి ఊరట పొందేలా జగనన్న విద్యా దీవెన పథకం వారికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.కార్యక్రమంలో సోషల్, బీసీ, మైనారిటీ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు రమేష్, వెంకటయ్య, నిర్మలాదేవి, పరిమళ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నూతన టెక్నికల్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు: విజయవాడ విద్యుత్ సౌధాలో స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ, ఎనర్జీ డిపార్ట్మెంట్ విజయానంద్ చాంబర్ లో ఏపీ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ 2024 నూతన టెక్నికల్ డైరీ ఆవిష్కరణ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ విజయానంద్ పాల్గొని టెక్నికల్ డైరీని టేబుల్ క్యాలెండర్‌ను జేఎండీ, విజిలెన్స్ మల్లారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.వి.మహేశ్వర రెడ్డి , ప్రధాన కార్యదర్శి కె.వి. శేషారెడ్డి , రాష్ట్ర ముఖ్య సలహాదారు ఏ.సుబ్బారావు , కార్య నిర్వాహక అధ్యక్షులు హుస్సేన్ ఖాన్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ట్రాన్స్కో, జెన్కో, డిస్కాంల కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు.

నేరాలు తగ్గుముఖం..

ప్రజాశక్తి-నెల్లూరు: జిల్లాలో ఈ ఏడాది నేరాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని ఎస్‌పి డాక్టరు కె.తిరుమలేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన జిల్లా వ్యాప్తంగా 2023 వ సంవత్సరానికి సంబంధించిన క్రైమ్ వివరాలు వెల్లడించారు. ముఖ్యంగా బాలికల కిడ్నాప్ కేసులు తగ్గాయని, గత సంవత్సరం తో పోలిస్తే కొట్లాట లు తగ్గాయన్నారు. మోసాల కేసులు గత, ప్రస్తుత సంవత్సరంలో సమానం గా ఉన్నాయని, రహదారుల ప్రమాదాలు పెరిగాయన్నారు. లోక్ అదాలత్ 4 సార్లు జరగ్గా వీటిలో 4 వేల 159 కేసులు రాజీలు అయ్యాయన్నారు. ఓపెన్ డ్రింకింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు ,క్రికెట్ బెట్టింగ్ కేసులు అధికమయ్యాయన్నారు. 307 రౌడీషీట్స్ జిల్లాలో నూతనంగా ప్రారంభించామని, 20కి పైగా సస్పెక్ట్ షీట్స్‌ను తెరిచామన్నారు. గంజాయి కేసులు ఎక్కువ గా నమోదు చేశామన్నారు. సమావేశంలో జిల్లాకు చెందిన పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఈవిఎం గోడౌన్‌లలో కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్థానిక ఆర్‌డిఒ కార్యాలయ ఆవరణలోని ఈవిఎం వివి పేట్ ల గోడౌన్లను పలు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ ఎం హరి నారాయణన్ శుక్రవారం తనిఖీ చేశారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా మూడు గోడౌన్ లలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీలు తీయించి పరిశీలించారు. కొద్ది నెలల్లో ఎన్నికలు రానున్న దష్ట్యా గోడౌన్లను పరిశుభ్రంగా ఉంచాలని ,గోడౌన్ల వద్ద భద్రతాపరంగా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు .ఈ పర్యటనలో వైసిపి ప్రతినిధి మురళీధర్ రెడ్డి, టిడిపి ప్రతినిధి రసూల్, బిజెపి ప్రతినిధి శ్రీనివాస్, బీఎస్పీ ప్రతినిధి శ్రీరామ్ , నెల్లూరు ఆర్డీవో మలోల, తహశీల్దార్ నిర్మలానంద్ బాబా , ఎలక్షన్ డి టి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అందని నష్టపరిహారం

ప్రజాశక్తి-పొదలకూరు: మండలంలోని కనుపర్తి గ్రామంలోని 41 మంది గిరిజన కుటుంబాలకు మిచౌంగ్ తుపాన్ నష్టపరిహారం సక్రమంగా అందలేదని గిరిజనులు, టీడీపీ మండల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలోని తహశీల్దారు వీర వసంతరావుకు తమగోడును తెలిపారు. తమలోని కొందరికి కేవలం 25 కేజీల బియ్యం అందించారని, నగదు ఎవరికి ఇవ్వలేదని,మరి కొందరికి బియ్యం కూడా ఇవ్వలేదన్నారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ వారికి నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా మండల నాయకులు తలచీరు మస్తాన్ బాబు, పట్టణ అధ్యక్షులు బొద్దులూరి మల్లికార్జున్ నాయుడు, కనుపర్తి గ్రామ నేత పసుపులేటి.మోహన్ రావు మాట్లాడుతూ మండలంలో తుపాన్ నష్టాన్ని అరకొర పంపిణీ చేసి అధికార పార్టీ నేతలు చేతులు దులుపుకున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు తుపాను నష్టపరిహారాన్ని పార్టీలకు అతీతంగా అందించామని ఈ ప్రభుత్వం మాత్రం కేవలం ఎస్‌టిలకే నష్టపరిహారం అందించామని చెప్తున్నారన్నారు.దీనిలో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఆ ఎస్టీలకు కూడా తుపాన్ నష్టపరిహారం సక్రమంగా అందలేదన్న అనడానికి కనుపర్తి గిరిజన కాలనీ ఉదాహరణగా చెప్పొచ్చన్నారు. వీరికి చెందాల్సిన పరిహారం ఎవరు భుజించారో తెలుపాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చిత్త శుద్ధితో నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు.


నినాదాలు చేస్తున్న దృశ్యం


మాట్లాడుతున్న మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

కాకాణి మోసగాడు:సోమిరెడ్డి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వైట్ కాలర్ క్రిమినల్ అని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం మండలంలోని పేడూరు పంచాయతీలో "బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ" కార్యక్రమం జరిగింది. టీడీపీ మండల అధ్యక్షులు సన్నారెడ్డి సురేష్ రెడ్డి అధ్యక్షతన, పిఎసిఎస్ మాజీ చైర్మన్ సోమిరె డ్డి శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన వైసీపీ ప్రభుత్వం, ముఖ్యంగా మంత్రి గోవర్ధన్ రెడ్డిపై ఘాటు విమర్శలు సంధించారు. ఏకంగా కోర్టులోనే ఫైల్స్ మాయం చేసిన మంత్రి కాకాణికి గనులు దోచుకోవడం మంచి నీరు తాగినంత సులువని విమర్శించారు. మైన్స్ దోచుకోవడం మినహా జిల్లా అభివద్ధికి మంత్రి గోవర్ధన్ రెడ్డి చేసింది శూ న్యం అన్నారు. రానున్న ఎన్నికల్లో మంత్రి కాకాణికి శుభం కార్డు పడుతుందని ఎద్దేవా చేశారు. ఆరోగ్య శ్రీ కింద వైద్య ఖర్చులు రూ.5 నుంచి 25 లక్షలకు పెంచుతు న్నట్లు సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రకటించడం హాస్యాస్పదమని విమర్శించారు. ఆ రోగ్య శ్రీ కింద వైద్యం చేసే ఆస్పత్రులు లేనప్పుడు కోటి రూపాయల వరకు పెంచినా ప్ర యోజనం ఏమిటి అని ఎద్దేవా చేశారు. రానున్న ఎ న్నికల్లో టీడీపీ, జనసేన వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించడం పక్కా అని ధీమా వ్యక్తం చేశారు.

టీడీపీలోకి వైసీపీ కుటుంబాలు చేరిక

పేడూరు గ్రామంలో వైసీపీకి చెందిన 70 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వైసీపీ నాయకు లు గూడూరు నారాయణ హ రి ఆధ్వర్యాన చంద్రమోహన్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. వీరికి సోమిరెడ్డి టీడీపీ కం డువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సోమిరెడ్డిని గజమాలతో ఘనంగా స త్కరించారు. దీనికి ముందు న రుకూరు నుంచి పేడూరు వర కు టిడిపి శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీపీ గూడూరు పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు వరిగొండ చినబాబిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, కొణతం రఘుబాబు, మాజీ ఎంపీ పీ నిర్మలమ్మ, ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసులు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు సందీప్, స్థానిక నేతలు మాగుంట రామకష్ణారెడ్డి, సోమిరెడ్డి సురేందర్ రెడ్డి, కార్య కర్తలు, అభిమానులు పాల్గొన్నా రు.

విద్యాభివృద్ధికి జగనన్న పెద్దపీట



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : భావి తరాల భవిష్యత్తు కోసం విద్య అభివృద్ధికి ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, ప్రతి సంవత్సరం ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందచేస్తున్న జగనన్న విద్యాదీవెనతో అండగా నిలుస్తున్నారని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జూలై - సెప్టెంబర్ 2023 త్రైమాసికానికి 8,09,039 విద్యార్థులకు లబ్ది చేకూరుస్తూ రూ.584 కోట్లను విడుదల చేశారు. ప్రతిఒక్కరూ విద్యలో అత్యుత్తమంగా రాణించడమే జగనన్న సంకల్పమన్నారు.

ఇబ్బందులకు గురవుతున్న కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి-కోవూరు : రాష్ట్రంలోనే రైల్వేకు ఆదాయాన్ని సమకూర్చే పడుగుపాడు రైల్వే గూడ్స్ షెడ్ యార్డ్ కాంట్రాక్టర్లను మాత్రం అనేక ఇబ్బందులకు గురి చేస్తుందని పడుగుపాడు రైల్వే కాంట్రాక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడందరామిరెడ్డి అన్నారు. స్థానిక పడుగుపాడు గూడ్స్ షెడ్ యార్డ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం యార్డ్‌కు రెండు వైపులా లోడింగ్, అన్‌లోడింగ్ సౌకర్యం ఉందని, అయితే ఐనముడు సెంటర్ వైపు ఉన్న యార్డ్‌లో విద్యుత్ స్తంభాలు, చెట్లు ఉండడం వల్ల ఆ ప్రాంతంలో రైల్వే వ్యాగన్ వచ్చినప్పుడు లోడింగ్‌కు అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. యార్డ్‌ను అభివృద్ధి చేయాలని గతంలోనే తాము రైల్వే డివిజనల్ మేనేజర్‌కు వినతిపత్రం కూడా అందజేశామన్నారు. అనంతరం రైల్వే ఎస్ఎస్‌కు వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవికుమార్ చౌదరి, ఎంబిఆర్ గోధుమ అధినేత ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా లారీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిచల్ నారాయణ, పడుగుపాడు రైల్వే గూడ్స్ షెడ్ కార్మికుల అసోసియేషన్ కార్యదర్శి ప్రసాద్, కొండబాబు, తదితరులున్నారు.

రూ.10వేలు ఆర్థికసాయం అందజేత



ప్రజాశక్తి-సంగం : మండలంలోని తరుణవాయి గ్రామంలోని దాసరిపాలెంలో ఇటీవల మృతి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త ఇండ్ల వనమ్మ కుటుంబ సభ్యులను ఆత్మకూరుకు చెందిన నిత్య అన్నదాత, శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పరామర్శించి ఆమె కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా కడు బాధలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త వనమ్మ భర్తను సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంది పరమేశ్వర్ రెడ్డి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్త ఇండ్ల వనమ్మ చనిపోవడంతో ఆమె ముగ్గురు పిల్లలు ఎంతో తల్లడిల్లడం చాలా బాధాకరమని తెలిపారు. ఆత్మకూరు ప్రాంత అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ మాట్లాడుతూ సంగం మండలానికి చెందిన తమ తోటి అంగన్‌వాడీ కార్యకర్త, గిరిజనురాలు వనమ్మ మృతి చెందడం తమకు తీరని లోటు అని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్ మాజీ చైర్మన్ కడుముల సుధాకర్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు రావుల్ల ప్రసాద్ రెడ్డి, రామిరెడ్డి అశోక్ రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ, పలువురు ఆత్మకూరు, సంగం అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

టిడిపి గెలుపే లక్ష్యం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని జిల్లా పార్లమెంటరీ ముస్లిం మైనారిటీసెల్ అధికార ప్రతినిధి షేక్.ఇంతియాజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఇందుకూరుపేట, కొత్తూరు నుండి బుచ్చిలో జరిగే నియోజకవర్గ స్థాయి ముస్లిం ఆత్మీయ సదస్సుకు 200మందితో భారీ ర్యాలీగా బయల్దేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి గెలుపే లక్ష్యంగా తమ ముస్లిం సోదరులు పనిచేస్తామన్నారు. మైనార్టీ నేతలు షేక్ గఫ్రూన్, షేక్ సాజిద్, షేక్ అనీఫ్, పఠాన్ అఫ్సల్, షేక్ ఇస్మాయిల్, షేక్ రఫీ పాల్గొన్నారు.

వైసిపిలో బిజెపినేత చేరిక

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్ : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో బిజెపికి ఆ పార్టీ సీనియర్ నాయకులు కె.సురేంద్ర చక్రధారి గుడ్ బై చెప్పారు. రూరల్ నియోజకవర్గంలోని 29వ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ కు చెందిన ఆ బిజెపి సీనియర్ నాయకులు కే సురేంద్ర చక్రధారి ఆ పార్టీని వీడారు. 29వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ షేక్ సత్తార్, పార్టీ కార్యకర్త నాయకుల సిహెచ్ సారాబుల ఆధ్వర్యంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు.

ఎంపి ఆదాలకు ఆత్మీయ సత్కారం

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్ : డాక్టర్ కొండూరు హరినారాయణ రెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరు లోని ఆదాల ప్రభాకర్ రెడ్డి కార్యాలయంలో ట్రస్టు వార్షికోత్సవానికి రావాలసిందిగా ఆహ్వానించిన డాక్టర్ కొండూరు హరినారాయణ రెడ్డి కోరారు. ఈసందర్భంగా కొండూరు హరినారాయణ రెడ్డి మాట్లాడుతూ ట్రస్టు ద్వారా గత మూడు సంవత్సరాలుగా అనేక సేవా, కళా, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ట్రస్టు వార్షికోత్సవానికి ఆదాల ప్రభాకర్ రెడ్డి విచ్చేయాలని కోరారు.

వైసిపి - టిడిపి నాయకుల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి-ఉదయగిరి : టిడిపి కార్యకర్తలు - వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మధ్య శుక్రవారం సాయంత్రం తోపులాట ఘర్షణ మారడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. వివరాల మేరకు.. హౌసింగ్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ మల్లు హర్ష స్థానికంగా శ్రీనగర్ కాలనీలో నూతనంగా గృహ నిర్మాణం చేస్తున్నారని టిడిపి ఆధ్వర్యంలో ప్రజాదీవెన యాత్ర జరుగుతున్న సందర్భంగా కొండరు గవర్నమెంట్ సిమెంట్‌తో ఇంటిని నిర్మిస్తున్నారని మాజీ బొల్లినేని వెంకట రామారావు దృష్టికి తీసుకురాగా మాజీ ఎఎంసి చైర్మన్ మన్నటి వెంకట రెడ్డి, మండల కన్వీనర్ అయ్యన్న కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. స్థానిక సిఐ వి.గిరిబాబు, ఎస్ఐ జంపాని కుమార్ రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టి వైసిపి నేతలను స్టేషన్‌కు తరలించి నమోదు చేసి విచారణ చేపట్టారు.

చిన్నారి కార్తికేయకు 'ఇంటూరి' ఆశీర్వాదం

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోని 28వ వార్డులో పెండ్ర మల్లికార్జున, అనూష కుమారుడు కార్తికేయ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, నాయకులు పాలంకి ప్రసాద్, సవిడిబోయిన వెంకటకృష్ణ, తోకల వెంకటేశ్వర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌బికెలలో సమృద్ధిగా ఎరువులు



ప్రజాశక్తి-కావలి రూరల్ : మండల పరిధిలో దాదాపూగా 16 ఆర్‌బికెల్లో ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని అగ్రికల్చర్ ఎ.ఒ ఎ.లలిత తెలియజేశారు. మండల పరిధిలో రైతులు వరి సాగు చేపట్టారన్నారు. ప్రస్తుతం వేరుశనగ, వరినట్లు, నారు మడులు, సాగు చేస్తున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో ఎరువుల కొరత లేకుండా సకాలంలో నాణ్యమైన ఎరువుల ఎంఆర్‌పి ధరలకే ప్రతి రైతు భరోసా కేంద్రాల్లో సమృద్ధిగా నిల్వలు ఉన్నాయన్నారు. ప్రయివేటు డీలర్లకు కూడా యూరియా కొరత లేకుండా సకాలంలో వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : బిట్రగుంటలో ఖాళీగా ఉన్న రైల్వే స్థలంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పల్ల నరహరి పేర్కొన్నారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం సిఐటియు మండల కార్యదర్శి రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పల్ల నరహరి, బిజెపి బోగోలు మండల అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు శుక్రవారం జిల్లా అధ్యక్షులు వంశీధర్ రెడ్డికి కలిసి వినతి పత్రం అందజేశారు. కోచ్ ఫ్యాక్టరీ బిట్రగుంటలో ఏర్పాటు చేయాలని వినతి పత్రం రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి, కేంద్ర రైల్వే మినిస్టర్ అశ్విని వైష్ణవ్ చేలా చూడాలని తెలియజేశామన్నారు.

ఈ-కెవైసి పూర్తి చేయాలి

ప్రజాశక్తి-సీతారామపురం : జగనన్న చెదోదు కార్యక్రమంలో ఇచ్చిన లబ్ధిదారులు తో ఈ-కెవైసిని పూర్తి చేయించాలని వలంటీర్లను తహశీల్దార్ ఎం కె.సుధాకర్ బాబు ఆదేశించారు. శుక్రవారం ఆయన సీతారామపురం బిట్-1 సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో ఆయన సమావేశమై మాట్లాడారు. కార్యక్రమంలో విఆర్ఒ మనోహర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎంపిడిఒ సస్పెన్షన్

ప్రజాశక్తి-సీతారామపురం : సీతారామపురం ఎంపిడిఒ రంగ సుబ్బరాయుడును సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ హరి నారాయణ్ ఉత్తర్వులను జారీ చేశారు. విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొంది. అనంతరం ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా ఇఒపిఆర్డి పి.సుబ్బారావు బాధ్యతలను చేపట్టారు.

బ్యాగులు పంపిణీ

ప్రజాశక్తి-సీతారామపురం : మండలంలోని 22మంది టిబి వ్యాధిగ్రస్తులకు న్యూట్రీషియన్ బ్యాగులను వైద్యాధికారిని ఎ.స్వప్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిబి వ్యాధిగ్రస్తులు మందులతో పాటు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని తద్వారా టిబి వ్యాధి నుండి త్వరగా కోలుకొని 2025 నాటికి టిబి అంతం కావాలని నినాదంతో ఇటువంటి అవకాశాలను ఉపయోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ మజీద్, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



అనంతసాగరంలో



కావలిలో...

ప్రజాశక్తి-అనంతసాగరం : అనంతసాగరం ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు గద్దలీలాల మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల సమ్మెకు ప్రజానాట్యమండలి పూర్తిస్థాయిలో మద్దతు తెలియజేస్తున్నదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగన్‌వాడీ సమస్యలు వేతనాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవడం లేదని, ఇప్పటికైనా అంగన్‌వాడీలతో చర్చలు జరిపి, వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనేక రాష్ట్రాల్లో అంగన్‌వాడీలకు కనీస వేతనాలు పెంచి గ్రాట్యుటీని కూడా అమలు చేస్తున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కనీస వేతనం పెంచే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు వేము పెంచలయ్య, సిఐటియు అనంతసాగరం మండల కార్యదర్శి అన్వర్‌బాషా, ఆవాజ్ మండల కార్యదర్శి రహమతుల్లా, ఐసిడిఎస్ అనంతసాగరం ప్రాజెక్టు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సునీత, నూర్జహాన్, వసుంధర, సుబ్బమ్మ, భాగ్యమ్మ, వెంకట సుబ్బమ్మ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి రూరల్ : రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అంగన్‌వాడీల నిరవధిక సమ్మె నేటికి 18వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా శుక్రవారం రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆ యూనియన్ అధ్యక్షులు రఘురామమ్మ ప్రారంభించారు. అనంతరం ఆకులు తింటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ 18 రోజులుగా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం మహిళలు రోడ్లెక్కి పోరాటాలు చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా దుర్మార్గమైన విషయమన్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నాలుగున్నర సంవత్సరాల కాలయాపన చేయడం వారి స్వార్థ పత్తింపచేసుకోకపోవడం, ఈ ఉద్యమంలో అంగన్‌వాడీ వర్కర్లు హెల్పర్ల కోర్కెలు ప్రభుత్వం తప్పి పడిపోతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించక పోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. మళ్లీ త్వరలో వచ్చే ఎన్నికలలో ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని విమర్శించారు. ఎన్నికలప్పుడు చేసిన హామీలు నేటికీ అమలు చేయకపోవడం ఏమిటని ఇలాంటి ప్రభుత్వాన్ని ప్రజలు నమ్ముతారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అంగన్‌వాడీ వర్కర్ల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని, అంతవరకూ ఈ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. దీక్షలో పి.బాలమ్మ, ఏ.జయంతి కుమారి, వై.సావిత్రి, పి.విజయ లక్ష్మి, కే.రాజేశ్వరి, జి.సుభాషిణి, పి.అనూష, ఆర్.కృష్ణవేణి, టి.వాణి కూర్చున్నారు. సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణమోహన్, నాయకులు పి.తిరుపాలు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రఘురామమ్మ, సుభాషిణి, పెంచలమ్మ తదితరులున్నారు.



ప్రజాశక్తి-ఉదయగిరి : అంగన్‌వాడీల సమ్మెలో సిఐటియు నాయకులు శుక్రవారం వెంకయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. మాట తప్పను మడమ తిప్పను అన్న జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మాట తప్పారన్నారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పార్లమెంట్‌లో చర్చించి వారికి రూ.26వేల వేతనం సుప్రీంకోర్టు జీ ప్రకారం గ్రాట్యుటీ అందించాలన్నారు. అక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టి కేసులు పెట్టి అరెస్టు చేయాలన్నారు. అంగన్‌వాడీల సమ్మె నెరవేరేంత వరకు కార్యాలయం రికార్డులను భద్రంగా ఉంచాలని చూడాలన్నారు. కార్యక్రమంలో ఉన్న అంగన్‌వాడీల ప్రాజెక్టు అధ్యక్షురాలు ప్రమీల, చాంద్‌బేగం, రమాదేవి, కార్యకర్తలున్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : తమకు న్యాయం జరిగే వరకూ సమ్మెను కొనసాగిస్తామని అంగన్‌వాడీ తెలియజేశారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం 18వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ 4సంవత్సరాలుగా తమకు న్యాయం చేస్తామని ఎదురు చూశామన్నారు. తెలంగాణ కంటే అదనపు వేతనాలు వస్తాయని ఆశిస్తే... ఇంతవరకు ఇవ్వలేదని తెలిపారు. సిఎం ఇప్పటికైనా స్పందించి తమకు ఇచ్చిన హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని మొరపెట్టుకుంటున్నామన్నారు. తమకు న్యాయం జరిగేంత వరకూ పోరాటం ఆగదని హెచ్చరించారు.



శిబిరంలో కళ్లు తిరిగి పడిపోయిన హెల్పర్

ప్రజాశక్తి-కావలి రూరల్ : ఆర్‌డిఒ కార్యాలయం ఎదురుగా జరుగుతున్న అంగన్‌వాడీల రిలే నిరాహార దీక్షలలో బోగోలు మండలం జువ్వలదిన్నె సెక్టార్‌కు చెందిన కె.గౌరమ్మ అనే హెల్పర్ కళ్లు తిరిగి పడిపోయింది. ప్రతిరోజు జువ్వలదిన్నె నుండి అంగన్‌వాడీ వర్కర్ల పోరాటానికి వచ్చి దీక్షా శిబిరంలో కూర్చున్న గౌరమ్మ ఒక్కసారిగా ఉన్నట్టుండి కళ్లు తిరిగి పడిపోయింది. పక్కనే ఉన్న అంగన్‌వాడీలు ఆమెకు ముఖంపై నీళ్లు చల్లి సముదాయించారు. అర్ధ గంట సమయం తర్వాత ఆమె స్పృహలోకి వచ్చింది.

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ప్రాజెక్టు వద్ద జరుగుతోన్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమానికి కందుకూరు ప్రాజెక్టు నాయకులు రాజేశ్వరి, సరస్వతి, ప్రభావతి నాయకత్వం వహించారు. ప్రభుత్వం అంగన్వాడీ సమస్యలు పరిష్కారం చేసే వరకు పోరాటం కొనసాగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మోహనరావు కోరారు. శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. కందుకూరు సిఐటియు ఎస్ఎ గౌస్, ఎస్ పవన్ కుమార్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ఉలవపాడు : రాష్ట్ర ప్రభుత్వం తాము ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు అంగన్‌వాడీలు పట్టుదలతో పోరాడుతారని, గత 18 రోజులుగా అంగన్‌వాడీలు చేస్తున్న ఆందోళనకు ఏ ప్రభుత్వమైనా దిగిరాక తప్పదని సిఐటియు జిల్లా నాయకులు ఎం.మోహన్‌రావు తెలియజేశారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఉలవపాడు ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం ప్రభుత్వ విధానాలు-అంగన్‌వాడీలపై ప్రభావం అనే అంశంపై స్టడిసర్కిల్ నిర్వహించారు. ఈ స్టడీ సర్కిల్‌కు ముఖ్యవక్తగా ఎం.మోహన్ రావు పాల్గొని మాట్లాడారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్చలు జరిపి, సమ్మె పరిష్కరించాలని కోరారు. లేనట్లయితే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు జీవీబీ కుమార్, లీడర్లు సి.హెచ్.ఇందిరా వతి, వాకా.లతారెడ్డి, ప్రముఖ విద్యావేత్త ఎస్.కే. మెహర్ అలీ ఉన్నారు. ఈ ఆందోళనలో సిఐటియు గుడ్లూరు అధ్యక్షులు ఎస్.కె.పద్మజ, మూడు మండలాల సెక్టార్ లీడర్లు పద్రె.తిరుపతమ్మ, కామాక్షమ్మ, పి.రమణ, యం. పద్మ, అంగన్‌వాడీలు సిహెచ్ పద్మజ, కత్తి బుజ్జమ్మ, గీత, పి. ధనలక్ష్మి, కే.శైలజ, డి.వరలక్ష్మి, బి.సుస్మిత, శేషమ్మ, భూలక్ష్మి పాల్గొన్నారు.

రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి-కందుకూరు



పట్టాలు అందజేస్తున్న ఎంఎల్ఎ మహిధర్‌రెడ్డి

ప్రభుత్వం ఇచ్చిన భూమి సాగు చేసుకుని దళిత రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి కోరారు. శుక్రవారం దళిత రైతులకు సాగుభూమి పట్టాలను మహీధర్ రెడ్డి పంపిణీ చేశారు. కందుకూరు, ఉలవపాడు మండలాలలో ఉన్న దళితులకు ఎన్నోయేళ్ల క్రితం భూమి కొనుగోలు పథకం కింద భూమి ఇచ్చిందని, అయితే వాటిపై దళితులకు హక్కు కల్పిస్తూ పట్టాలు ఇవ్వలేదన్నారు. దాంతో ఆ భూముల సమస్య పరిష్కారం కాకుండా ఉండిపోయిందని తెలిపారు. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించినట్లు తెలిపారు. లబ్ధిదారుల వాటాగా చెల్లించాల్సిన డబ్బులు చెల్లించడంతోపాటు దళితులకు ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా గతంలో భూమి కొనుగోలు పథకం కింద ఇచ్చిన భూములకు పట్టాలు ఇచ్చారన్నారు. దాదాపు 463మందికి అరెకరా చొప్పున భూమి పట్టాలను ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దారు ఆర్ బ్రహ్మయ్య, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్‌లలో ఎంఇఒ సందర్శన

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని రేవూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిసికల్ సైన్స్ సబ్జెక్ట్ కాంప్లెక్స్, ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్‌లను ఎంఇఒ-1 బాలకృష్ణారెడ్డి సందర్శించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ ఉపాధ్యాయులు నేతృత్వంలో విద్యార్థులు తయారుచేసిన ప్లేవింగ్ రోబో రిమోట్ వీల్ చైర్ మోడళ్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులకు రాబోవు మూడు నెలలు కీలకమని, విద్యార్థులకు సామర్థ్యాలు అన్ని వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఉపాధ్యాయులు గురుప్రసాద్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు రెడ్డి, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-దగదర్తి

మండల కేంద్రమైన దగదర్తి జిల్లా ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంపిపి తాళ్లూరు వెంకటకృష్ణ ప్రసాద్ నాయుడు శుక్రవారం పరిశీలించారు. రోజువారీ మెనూ మిడ్డిమీన్స్ వర్కర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మంచి భోజనం పెట్టాలని ఉద్దేశంతో మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకుని వచ్చిందన్నారు. ప్రభుత్వం రోజువారీ భోజనంలో ఇవ్వాల్సిన మెనూ క్రమం తప్పకుండా ఇవ్వాలని సూచించారు. ఎవరైనా కానీ ఈ పథకాన్ని సరిగా అమలు చేయకపోతే అట్టివారిపై కఠిన చర్యలు తప్పవని వారి హెచ్చరించారు.

అన్ని రంగాలలో ముస్లిములు రాణించాలి

ప్రజాశక్తి-కందుకూరు

అన్నీ రంగాలతో పాటు రాజకీయ రంగంలో కూడా ముస్లీం యువత రాణించాలని సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా కందుకూరు నియోజకవర్గం ప్రెసిడెంట్ షేక్ ముజీబ్ కోరారు. సామాజిక ఆర్థిక సాంస్కృతిక రంగాలలో రాణిస్తూనే రాజకీయాలు అవగాహన చేసుకోవాలన్నారు. ఈ మధ్య వైసిపి తరపున యువజన విభాగం జిల్లా సెక్రటరీగా ఎన్నికైన షేక్ మహబూబ్ బాషాకు అభినందనలు తెలియజేశారు. మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకుంటూ దుశ్శాలువాను కప్పి సత్కరించారు. షేక్ రసూల్, షేక్ సలీం, షేక్ మాబూబ్ బాషా, షేక్ మునాఫ్, షేక్ జాహిద్, షేక్ మసూద్, షేక్ రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

ఉరితాళ్లతో మున్సిపల్ కార్మికుల నిరసన



కావలిలో..

ప్రజాశక్తి-కావలి రూరల్

మున్సిపల్ కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరవధిక సమ్మె నాలుగో రోజులో భాగంగా శుక్రవారం వినూత్నంగా మెడకు ఉరితాళ్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పి.తిరుపాలు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు కార్మికుల పర్మినెంట్, డైలీ కార్మికులను అవుట్‌సోర్సింగ్‌లో చేర్చాలని, రిటైర్డ్‌మెంట్ బెనెఫిట్స్, పెన్షన్ విధానం ఇంకా మరికొన్ని డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఈ సమ్మె చేపట్టారని తెలిపారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి కార్మికులకు ఇచ్చిన పర్మినెంట్ హామీని కూడా అమలు చేయకపోవడం కార్మికులను మోసగించడమేనని ఈ ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక పరిపాలన కొనసాగిస్తున్నదని అన్ని సంఘాలు కార్మికులు రోడ్లెక్కి పోరాటాలు చేస్తున్నప్పటికీ ఈ ప్రభుత్వం పెడచెవిన పెడుతుందని తెలిపారు. ఈ ప్రభుత్వం ఇలాగే ఉంటే ప్రజలు కార్మికులు త్వరలో తగిన బుద్ధి చెబుతారని, మున్సిపల్ కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య, యూనియన్ నాయకులు, తురక సీనయ్య, ఒంగోలు రమేషు, బిడుదల మహేష్, కె.బాబు, ఎన్.క్రాంతి, ఎం.పోలయ్య, మహిళా నాయకులు ఆప్పాటి జ్యోతి, సునీత, వెంకమ్మ, మాలక్ష్మమ్మ, చిన్నమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని, జిల్లా కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షులు గంటా లక్ష్మీపతి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నాలుగో రోజు సమ్మెలో ఉరితాళ్లతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం లక్ష్మీపతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో మున్సిపల్ కార్మికుల పనితీరును అభినందించారు. మా ప్రభుత్వం వచ్చిన వెంటనే కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా చేస్తానని ఆనాడు హామీనిచ్చారని తెలిపారు. కరోనా సమయంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మున్సిపల్ కార్మికులు చేసిన సేవలు గుర్తించి కార్మికులను ఘనంగా సన్మానించారు. కానీ ఇప్పటివరకు వారిని పర్మినెంట్ చేయలేదన్నారు. ప్రభుత్వం వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, వారికి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిఐటియు గౌరవాధ్యక్షులు, సిపిఎం పట్టణ కార్యదర్శి కొప్పోలు డేవిడ్ రాజు, మున్సిపల్ కార్మికుల కార్మికుల యూనియన్ నాయకులు నాగేంద్ర, రిజ్వాన్, గురవయ్య, రూబీన్ పాల్గొన్నారు.




ఆత్మకూరులో....

బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు పట్టణంలో బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం 20వ వార్డులోని పోస్టాఫీస్ సెంటర్, పార్కురోడ్డు, నందావారి వీధి ప్రాంతాలలో మినీ మేనిఫెస్టో కరపత్రాలను టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, పార్టీ నేతలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. అర్హత లేని వ్యక్తికి అధికారం ఇవ్వడం ఫలితంగానే రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. రాజధాని ఏదీ అంటే చెప్పలేని దుస్థితిలో ఉన్నామని తెలిపారు. కందుకూరుకు రూ.25కోట్లు ఇస్తానని జగన్మోహన్ రెడ్డి ప్రకటించి ఏడాదిన్నర కావస్తోందని, వాటిలో ఎన్ని కోట్లు విడుదల చేయించారని అడిగితే ఎంఎల్ఎ నోరు విప్పడం లేదన్నారు. మాయ మాటలు చెప్పి మోసం చేయడంలో అక్కడ జగన్మోహన్ రెడ్డి, ఇక్కడ మహీధర్ రెడ్డి ఇద్దరూఇద్దరే అన్నారు. మరోసారి మోసపోకుండా, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రాబోయే ఎన్నికల్లో ఓటు వేయాలని ప్రజలకు సూచించారు. కందుకూరు నియోజకవర్గంను తిరిగి ప్రకాశం జిల్లాలో కలపడంతో మొదలుపెట్టి, నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతీ సమస్యను పరిష్కరించే బాధ్యత తనదన్నారు. ఒక్క అవకాశం ఇచ్చి చూడండి నియోజకవర్గ రూపురేఖలు మారుస్తా అని తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీను, వార్డు అధ్యక్షుడు వడ్లమూడి చెంచు నారాయణ, నాయకులు వలేటి వెంకటేశ్వర్లు, గుమ్మా శివ, నందికనమ లక్ష్మణరావు, బొల్లినేని నాగేశ్వరరావు, మచ్చా మనోహర్, చీదేళ్ల రామారావు, చీదేళ్ల బాలకృష్ణ, గుర్రం నరసింహారావు, యర్రా యోగేశ్వరరావు, చీదేళ్ల సుబ్బారావు, నాయకులు చిలకపాటి మధు, బెజవాడ ప్రసాద్, రాయపాటి శ్రీనివాసరావు, రెబ్బవరపు మాల్యాద్రి, పొడపాటి మహేష్, షేక్ మున్నా, చుండూరి శీను, ముచ్చు వేణు, షేక్ సలాం, సవిడిబోయిన వెంకటకృష్ణ, పులి నాగరాజు, షేక్ ఫిరోజ్, ఫాజిల్, షేక్ ఖలీల్, షేక్ మమ్ముషా, కాలేషా, రసూల్, ముప్పవరపు వేణు, అత్తోట మాల్యాద్రి, రామ్మూర్తి, దాసరి ప్రమోద్, షేక్ మమ్ముషా, సవలం కేశవులు తదితరులున్నారు.





జిమ్‌ను ప్రారంభిస్తున్న బిఎంఆర్

జిమ్ ప్రారంభం

ప్రజాశక్తి-కావలి

బాడీ బిల్డింగ్ జిల్లా కార్యదర్శి జగన్ ఆధ్వర్యంలో ఉదయగిరి రోడ్డులో బాపూజీ కాలనీ బాపూజీనగర్‌లో ఏర్పాటు చేయగా రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు జిమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ బెజవాడ రవికుమార్, డాక్టర్ మంచికంటి రామస్వామి, వైసిపి నాయకులు నగళ్ల శ్రీనివాస కిరణ్, ఈతముక్కల బాల మురళి రెడ్డి, కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కేతిరెడ్డి జగదీశ్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, గంధం ప్రసన్నాంజనేయులు, దామిశెట్టి సుధీర్‌నాయుడు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మర్రిపాడు : మండల కేంద్రం విద్యా వనరుల కేంద్రంలో ఎపిటిఎఫ్ 2024 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్, పాకెట్ క్యాలెండర్‌లను ఎంఇఒ-2 ధనలక్ష్మి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.సుధాకర్ రెడ్డి, మండల అధ్యక్షులు ఎం.శ్రీనివాసులు రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వరరాజు ప్రధానోపాధ్యాయులు కె.పెంచలయ్య, ఎన్‌సి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజూ ప్రజాదీవెన యాత్ర



ప్రజాశక్తి-ఉదయగిరి : రెండవ రోజు శుక్రవారం పట్టణంలో సినిమా హాల్ సెంటర్ శ్రీనగర్ కాలనీ మంగళకట్ట పేర్లచాడి ప్రాంతాలలో ప్రజాదీవెన యాత్రను ఇంటింటా విస్తృత పర్యటన మాజీ ఎంఎల్ఎ బొల్లినేని వెంకట రామారావు చేపట్టారు. ఈ సందర్భంగా బొల్లినేని మాట్లాడుతూ ఇంటింటా ప్రచారంలో ప్రజల నుండి అపూర్వ ఆదరణ లభిస్తుందన్నారు. జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నాటి నుండి అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడ అభివృద్ధి లేదని టిడిపి హయాంలో చేసిన అభివృద్ధి కనబడుతుందన్నారు. ఇలాంటి రాక్షస పాలన చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును మరోమారు ముఖ్యమంత్రి చేసుకోవాలని కోరారు. అనంతరం బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంచారు. ఇదే క్రమంలో శ్రీనగర్ కాలనీలో వర్క్ ఇన్‌స్పెక్టర్ హర్ష నూతనంగా నిర్మిస్తున్న గృహానికి ప్రభుత్వ సిమెంట్ వాడుతున్నారని ఆరోపణలు చేయగా మాజీ ఎంఎల్ఎ బొల్లినేని ఇంటిని పరిశీలించారు. అక్రమంగా నిలువ ఉంచిన సిమెంట్ బస్తాలను నిలువలను గుర్తించి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ అక్రమాలకు పాలుపడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మండల కన్వీనర్ చింతబోయిన బయన్న, మాజీ ఎఎంసి చైర్మన్ మన్నటి వెంకటరెడ్డి, మైనార్టీ నాయకులు షేక్ రియాజ్, ఎస్‌సిసెల్ నాయకులు మాజీ మండల కన్వీనర్ బొజ్జ నరసింహులు, సంధాని, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ట్యాబులు పంపిణీ



ప్రజాశక్తి-దగదర్తి : మండల పరిధిలోని చెన్నూరు పంచాయతీలోని కట్టుబడిపాలెం జిల్లా ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు ఎంపిపి తాళ్లూరు వెంకటకృష్ణ ప్రసాద్ నాయుడు, పోలీస్ హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ పి.అనిల్ రెడ్డి శుక్రవారం ట్యాబులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వము పాఠశాలలను నాడు-నేడు కింద అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వేముల ఆదిశేషయ్య, ఎంఇఒ భాస్కర్, ఎంపిటిసి, సర్పంచులు, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-జలదంకి : జలదంకి పంచాయతీ స్థానిక నెహ్రూ కాలనీలో స్థానికుడు పొట్లూరి నాగరాజు పూరిగుడిసె డిసెంబర్ 25న ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమవడంతో, ఈ విషయాన్ని ఉదయగిరి నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కొట్టే వెంకటేశ్వర్లుకు తెలియజేయగా వెంటనే స్పందించిన ఆయన శుక్రవారం తక్షణసాయంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. త్వరలో వాళ్ల ఇంటి కట్టుబడికి పార్టీ తమవంతు సహాయం చేస్తారని తెలియజేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో జనసేన తరుపున కలెక్టర్‌కు వినతి పత్రం అందించి ప్రభుత్వం ద్వారా తక్షణ సహాయం నిరుపేద కుటుంబాన్ని ఆదుకోమని తెలియబరుస్తామన్నారు. జనసేన సీనియర్ నాయకులు నిమ్మలపల్లి రామ చైతన్య, టిడిపి మండలం అధ్యక్షులు మధు రెడ్డి, జనసేన మండలం అధ్యక్షులు తోట మురళి జనసేన మండలం ఉపాధ్యక్షులు తొటెంపూడి రఘు, మండల కార్య వర్గ సభ్యులు అరవింద్, వేణు, సురేంద్ర పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-కావలి : టీమ్ సేవియర్ స్వచ్ఛంద సంస్థ వారు జయంత్, వినీష్, మురళి, తేజస్విని అనే విద్యార్థులు చిన్న వయసులోనే దివ్యాంగులకు పేదవారికి, ప్లాట్‌ఫారంపై బతికే వారికి అన్నం, చలికి దుప్పట్లు, దివ్యాంగురాలు అయిన సులోచనమ్మకు వీల్ చైర్, దివ్యాంగుల కాలనీలో 50మందికి దుప్పట్లు అందజేశారు. కాలనీ ప్రసిడెంట్ మండవ వెంకట రావు వారి సంకల్ప దీక్ష చేపట్టిన పనులకు అబ్బురపడి ఈ విధంగా సేవ చేసే వారు ముందుకు రావాలని కోరారు. తమను గుర్తించి సహాయం చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నామన్నారు.

ట్రై సైకిల్ వితరణ



ప్రజాశక్తి-కావలి : సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో సంస్థ సభ్యుల సహకారంతో కావలి పట్టణం పరిసర ప్రాంతమైన రుద్రకోట నివాసి, దివ్యాంగుడైన చలంచర్ల. ప్రహల్లాద్‌కు శుక్రవారం అవసరమైన ట్రై సైకిల్‌ను రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్ రావు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బెజవాడ రవికుమార్, డాక్టర్ మంచికంటి రామస్వామి, శ్రీచైతన్య డిగ్రీ కళాశాల డైరెక్టర్ పి.జానకిరాం, మాజీ మున్సిపల్ చైర్మన్ నగళ్ల.కిరణ్ కుమార్, మాజీ కౌన్సిలర్స్ గంధం ప్రసన్నాంజనేయులు, కామరాజు.సురేష్, దామిశెట్టి.సుధీర్ నాయుడు, విశ్రాంత బిసి సంక్షేమాధికారి షేక్ ఖాదర్ భాషా, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఎంఆర్ మాట్లాడుతూ తమ బి.ఎం.ఆర్. ట్రస్ట్ ద్వారా బ్యాటరీతో నడిచే ట్రై సైకిళు త్వరలో అంద జేస్తున్నట్లు తెలిపారు. ఏ దివ్యాంగుడు నడలేక ఇబ్బందులు పడ కూడదనే ఉద్దేశంతో ఏర్పాటు చేశామన్నారు. సంయుక్త సేవాసంస్థ ద్వారా చేస్తున్న సేవలను అభినందించారు. దివ్యాంగుడు చలంచర్ల. ప్రహల్లాద్ మాట్లాడుతూ తాను ఎన్నో నెలలుగా ట్రై సైకిల్ లేక ఇబ్బందులు పడుతున్నానని, ఎవరిని అడిగినా సాయం చేయలేదని తెలిపారు. జర్నలిస్ట్ బాలచంద్రకి తాను పడుతున్న ఇబ్బందిని తెలియజేయడంతో ఆయన సంయుక్త సేవాసంస్థ సురేంద్రకు తెలియజేసి తనకు ట్రై సైకిల్ వచ్చేలా చేశారని తెలిపారు. తనకు సహాయం అందజేసిన సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్రకు, సంస్థ సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతూ ఉన్నామని తెలిపారు.